



# మనం మెదక్ సంగారెడ్డి సిద్దిపేట

గురువారం । 7 । సెప్టెంబర్ । 2023 । పేజీలు : 7




# చికుబుకు... చికుబుకు...

- శరవేగంగా రైల్వే పనులు
- త్వరలో మోగనున్న కూత
- పుష్-పుల్ ప్యాసింజర్ నడపాలి
- మెదక్ - సిద్దిపేట లైన్లను కలపండి
- రైల్వే జిఎంను కోరిన మంత్రి హరీష్‌రావు

సిద్దిపేట, సెప్టెంబర్ 06, మనం న్యూస్ ప్రతినిధిః ఇప్పటికే ట్రయల్ రన్ ప్రారంభమై సిద్దిపేటలో ఒరిజినల్ రైలు కూత కోసం ఎదురు చూస్తున్న జిల్లా వాసుల కోరిక కొద్ది రోజుల్లో నెరవేరబోతుంది. దశాబ్దాల కాలంగా రైలు కోసం ఎదురు చూసిన స్వప్నం సాకారం కాబోతన్న వేళ ప్రజలకు మరిన్ని మంచి సేవలు అందించేందుకు కృషి చేయాలని రాష్ట్ర మంత్రి హరీష్‌రావు ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి బుధవారంనాడు దక్షిణ మధ్య రైల్వే జిఎం అరుణ్‌కుమార్ జైన్‌ను కలిశారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సిద్దిపేట మీదుగా సాగుతున్న రైల్వే పనుల తీరు, పెండింగ్ పనుల వివరాలను తెలియజేసి పనులు త్వరితంగా పూర్తయ్యేలా చూడాలని కోరారు. ఇప్పటికే ట్రయల్ రన్ పూర్తి కావడంతో సర్వీసులు ప్రారంభమయ్యే నాటికే పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని కోరారు. హైదరాబాద్ నుండి సిద్దిపేటకు పుష్-పుల్ ప్యాసింజర్ ట్రైన్‌ను నడపడంతోపాటు సిద్దిపేట నుండి తిరుపతి, బెంగుళూరులకు రైళ్లను ప్రారంభించాల్సిందిగా కోరరు. అదేవిధంగా ఔటర్‌రింగ్ రైల్వే ప్రాజెక్టులో మెదక్-సిద్దిపేట లైన్లను కలపాలని, చేగుంట-మెదక్ రోడ్డులో నూతన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు వెనువెంటనే ఇవ్వాల్సిందిగా కోరారు. ఈనెల 15వ తేదీన రైల్వే సేఫ్టీ కమీషన్ ఇన్‌స్పెక్షన్ పూర్తి కాగానే ప్యాసింజర్ రైల్‌ను ప్రారంభించే విధంగా చూడాలని, అదే రోజున హైదరాబాద్ నుండి సిద్దిపేటకు పుష్-పుల్ రైల్‌ను కూడా ప్రత్యేకంగా ప్రారంభించాలని కోరారు. పటాన్‌చెరు మిగతా 2లో..





## జై శ్రీకృష్ణ

వాడవాడలా ఘనంగా గోకులాష్టమి వేడుకలు 2లో

## మంత్రి హరీష్‌రావును కలిసి గౌడ సంఘం నాయకులు

స్థలాన్ని గౌడ సంఘానికే ఇప్పిస్తానని హామీ ఇచ్చిన మంత్రి హరీష్‌రావు 5లో






## చికుబుకు... చికుబుకు....




మొదటి పేజీ తరువాయి..

ఏదులనాగుపల్లిలో గూడ్స్ టర్మినల్‌ను త్వరితంగా పూర్తి చేయడంతోపాటు కొమురవెల్లి మల్లన్న దేవాలయం వద్ద కొత్త రైల్వే స్టేషన్ పనులను పూర్తి చేయాల్సిందిగా కోరారు. మూసాయిపేట రైల్వే పెండింగ్ పనులను కూడా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. దేశంలో ఇప్పటి వరకు మొట్టమొదటి సారిగా ఒక్క కోర్టు కేసు కూడా లేకుండానే ప్రాజెక్టును పూర్తి చేయగలిగామని, దేశ చరిత్రలోనే అత్యంత త్వరితంగా సిద్దిపేట రైల్వే లైన్ పూర్తి అయిందంటే రాష్ట్ర ప్రభుత్వం వేగంగా భూ సేకరణ చేసి రైల్వే శాఖకు ఇవ్వడం వల్లే సాధ్యమైందన్నారు. జనాభా అవసరాల దృష్ట్యా ఔటర్‌రింగ్ రైల్వే లైన్‌ను మెదక్–సిద్దిపేట మీదుగా నిర్మించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ సంపూర్ణ సహకారం, ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంతర పర్యవేక్షణతోనే ప్రాజెక్టు విజయవంతమైందని, రూ. 250 కోట్లతో రెండువేల ఎకరాలను ఎలాంటి అడ్డంకులు లేకుండా సేకరించి రైల్వే శాఖకు ఇవ్వడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ. 315 కోట్లు కూడా నిర్ణీత సమయంలో విడుదల చేయడం ద్వారానే ప్రాజెక్టు విజయవంతమైందన్నారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డిలు చేసిన విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన రైల్వే జిఎం. అరుణ్‌కుమార్ జైన్ ప్రతిపాదనలను వెంటనే రైల్వే బోర్డుకు పంపిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మిగతా పనులు పూర్తి కోసం, అనుమతుల కోసం త్వరలోనే రైల్వే బోర్డును కలవనున్నట్లు మంత్రి తెలిపారు.

# శ్రీ కృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు

## అంతర్జాతీయ చిత్రకారులు రుస్తుం



సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 06, మనం న్యూస్ః శ్రీ కృష్ణుని బోధనలు ప్రతి ఒక్కరికి కనువిప్పు కావాలని చిత్రకారులు రుస్తుం అన్నారు. శ్రీ కృష్ణ జన్మాష్టమి పండుగను పురస్కరించుకొని రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో బుధవారం కృష్ణాష్టమి కాన్వాస్ చిత్రాన్ని అంతర్జాతీయ చిత్రకారులు రుస్తుం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ కృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలియజేస్తూ పండుగలు సంస్కృతి సాంప్రదాయాలను కళావంతం చేస్తాయ న్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ భారతీయులు జరుపుకునే ముఖ్య పండుగ అని, శ్రీ కృష్ణుణి బోధనలే భగవత్ గీత హిందూ మతం పవిత్ర గ్రంథం సృష్టికర్త శ్రీ కృష్ణుని జన్మదినమే శ్రీ కృష్ణ జన్మాష్టమి అన్నారు. భగవత్ గీత సారాం ఒంటపట్టించుకుంటే ప్రపంచలో ఎలాంటి కొట్లాటలు ఉండవని, స్వార్థం, గర్వం, అహంకారం, ఆవహిస్తే ఉన్మాదం మనిషిని దుర్మార్గుగ్గునిగా మారుస్తుందని భగవత్‌దీట నొక్కివక్కాణిస్తుందన్నారు. శ్రీ కృష్ణుని బోధనలు ప్రతి ఒక్కరికి కనువిప్పు కావాలని అందరూ సుఖ శాంతులతో ఐకమత్యంగా భిన్నత్వంలో ఏకత్వంగా బతకాలని, తెలంగాణ రాష్ట్ర రాష్ట్రం అన్నింఆ ముందుండి భారతదేశం ప్రపంచానికి మార్గదర్శనం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఎఫ్ అధ్యక్షురాలు జులేఖా రుస్తుం , నైరుప్య చిత్రకారుడు నయీం రుస్తుం, గ్రైట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రుబీనా రుస్తుం, మొహ్మద్ సాధిక్, ఎండి. రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

### లయన్స్ క్లబ్ సేవలు

## అనిర్వచనీయం

బెజ్జంకి, సెప్టెంబర్ 06, మనం న్యూస్ః లయన్స్ క్లబ్ వారు ప్రజల సౌకర్యార్థం అందిస్తున్న సేవలు అనిర్వచనీమని, ఎన్నో ప్రజోపయోగ పనులు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతుందని జెడ్పి ఛైర్‌పర్సన్ వేలేటి రోజారాధాకృష్ణ శర్మ అన్నారు. బెజ్జంకి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో 106 మంది గర్భిణీ స్త్రీలకు సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాంప్రదాయ పద్ధతిలో సీమంతం నిర్వహించడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమం చేపట్టిన క్లబ్ సభ్యులు ధన్యులు, మున్ముందు క్లబ్ చేపట్టే సేవా కార్యక్రమాల్లో తన సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నిర్మల, జెడ్పిటిసి కవిత, సర్పంచ్ మంజుల, ఏఎంసి చంద్రకళ, లయన్స క్లబ్ జిల్లా గవర్నర్ హెచ్. రాజిరెడ్డి, ఉప గవర్నర్లు వెంకటేశ్వర్‌రావు, కోదండరాం, మల్టిపుల్ కౌన్సిలర్ మాజీ చైర్మన్ గుర్రం శ్రీనివాస్‌రెడ్డి క్లబ్ అధ్యక్షులు భరత్, శ్రీనివాస్, సత్తయ్య, సుదర్శన్‌రెడ్డి, ప్రభాకర్, రాజయ్య పాల్గొన్నారు.

### ఏఎంసి ఉద్యోగి సునీల్‌ను

## పరామర్శించిన బిఆర్ఎస్ నాయకులు



తొగుట, సెప్టెంబర్ 06, మనం న్యూస్ః తొగుట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగి సునీల్ తండ్రి దానయ్య అనారోగ్యంతో మంగళవారం మరణించగా విషయం తెలుసుకున్న ఏఎంసి ఛైర్మన్ దోమల కొమురయ్య, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, చందాపూర్ సర్పంచ్ బొడ్డు నర్సింలులు హైదరాబాద్‌లో ఆయన అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చి సునీల్‌ను ఓదార్చారు. పరామర్శించిన వారిలో ఏఎంసి వైస్ ఛైర్మన్ దేవునూరి పోచయ్య, డైరెక్టర్‌లు కిరణ్‌కుమార్‌రెడ్డి, నరేందర్ గౌడ్, రాజిరెడ్డి, కనకయ్యా, సంతోష్, పర్శరాములు, సత్యం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.






# జై శ్రీకృష్ణ






సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 06, మనం న్యూస్ః హిందువులకు అతి ముఖ్యమైన పండుగలలో కృష్ణాష్టమి పండుగ ఒకటి. కృష్ణాష్టమి వేడుకలను పట్టణంలోని పలు పాఠశాలలు, సుందర సత్సంగంలో ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుని వేషధారణలో, బాలికలు గోపికల వేషధారణలో అలరించారు. ఎనిమిదవ అవతారమైన శ్రీ కృష్ణుని జన్మదినం గొప్పదనాన్ని వివరిస్తూ పాఠశాలలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. కోలాటము, దాండియా, సాంప్రదాయ నృత్యాలతో అలరించారు. ఉట్టికొట్టే కార్యక్రమంతో అలరించారు. కృష్ణాష్టమి పండుగ గొప్పదనాన్ని విద్యార్థులకు తెలిసేలా పాఠశాలల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

# కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

### సమిష్టి కృషితో ముందుకెళ్లాలి

### హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్



హుస్నాబాద్,సెప్టెంబర్ 6,(మనం న్యూస్)ః కార్మికుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ అన్నారు. పట్టణ కేంద్రంలోని 17 వ వార్డులో రూ.10 లక్షలతో నిర్మించనున్న భవన నిర్మాణ కార్మిక తాపీ సంఘ భవనానికి బుధవారం ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. ఏ రాష్ట్రంలో లేనటువంటి సంక్షేమ పథకాలు అమలు పరుస్తూ రాష్ట్రంలో కార్మిక, కర్షక, సబ్బండ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కార్మికులు సమిష్టికృషితో ముందుకు వెళ్లాలని, లేబర్‌యాక్టు ప్రకారం బీమా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, భవన నిర్మాణ కార్మిక తాపీ సంఘం అధ్యక్షుడు యామ కొమురెల్లి, కార్యదర్శి చెన్నబోయిన సంపత్, కౌన్సిలర్ వల్లపు రాజు, కార్మిక సంఘం నాయకులు, తదితరులున్నారు.

# మహిళా బిల్లుకు మద్ధతివ్వండి



హుస్నాబాద్,సెప్టెంబర్ 6,(మనం న్యూస్)ః మహిళా బిల్లుకు మద్ధతివ్వాలని, పారమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా బిల్లును ప్రవేశపెట్టాలని భారత జాగృతి జిల్లా అధ్యక్షుడు పర్వతనేని శ్రీధర్ రావు డిమాండ్ చేసారు. హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ కోసం ఎమ్మెల్సీ కవిత చేస్తున్న ప్రయత్నాలకు దేశవ్యాప్తంగా అనేక రాజకీయ పార్టీలు మద్ధతిచ్చాయి అన్నారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లోనే బిల్లును ఆమోదింపజేయాలని 47 పార్టీలకు ఆమె రాసిన లేఖకు అపూర్వ స్పందన లభించిందన్నారు. మహిళా బిల్లును డిమాండ్ చేస్తూ గతంలోనే భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టారని ఆయన గుర్తు చేసారు. చట్ట సభల్లో మహిళా ప్రాధాన్యం పెరిగేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మహిళా రిజర్వేషన్ పార్టీలన్నీ మద్ధతు ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు.

# మద్యం తాగి వాహనం నడిపితే జైలుకే

### - మైనర్‌లకు వాహనాలిస్తే తల్లిదండ్రుల పై చర్యలు

### - హుస్నాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎర్రల కిరణ్



హుస్నాబాద్,సెప్టెంబర్ 6,(మనం న్యూస్)ః మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడితు చట్టం ప్రకారం శిక్షార్హులు అవుతారని హుస్నాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎర్రల కిరణ్ హెచ్చరించారు. హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారితో పాటు వారి తల్లిదండ్రులను పిలిచి పోలీస్‌స్టేషన్ ఎదుట సి.ఐ.కిరణ్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లకు తక్కువగా ఉండి వాహనాలు నడిపినా, లైసెన్స్ లేకపోయినా కేసులు నమోదు చేస్తామని ఆయన స్పష్టం చేసారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ఎదుటివారి ప్రాణాలు పోవడానికి కారణమైతే క్రిమినల్ కేసు నమోదవుతుందన్నారు. ఆటోలో నలుగురు ఎక్కాల్సి ఉండగా 10–15 మందిని ఎక్కిస్తున్నారని, ఇద్దరు ఎక్కాల్సిన టూవీలర్ పై పిల్లలతో కలిసి నలుగురు ఎక్కుతున్నారని, దీని వల్ల ప్రమాదం జరిగినపుడు కుటుంబమే నష్టపోవాల్సి వస్తుందన్నారు. మద్యం తాగి వాహనం నడిపేవారు అమాయకుల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్నారని ఆయన తెలిపారు. పోలీసులు ఎప్పుడు పౌర సమాజానికి మంచి స్నేహితులని మంచి చేసిన వారికి అండగా ఉంటూ చెడు చేసిన వారికి కచ్చితంగా శిక్ష ఉంటుందన్నారు. 18 ఏళ్లు పైబడి డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే వాహనాలు నడపాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులు లేదా వాహన యజమానుల పై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ.తోట మహేశ్, ఎఎస్ఐ మణి, పోలీస్ కానిస్టేబుల్స్, తదితరులున్నారు.

# మృతుల కుటుంబాలకు జేఎస్ఆర్ పరామర్శ



కోహెడ,సెప్టెంబర్ 6,(మనం న్యూస్)ః ఇటీవల పలువురు మరణించిన కుటుంబాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. మండలంలోని నారాయణాపూర్ గ్రామానికి చెందిన బొల్లి శంకర్, వోడ్నాల సువర్ణలు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను జేఎస్ఆర్ పరామర్శించి మృతికి గల కారణాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలన్నారు. ఆయన వెంట బూత్ అధ్యక్షుడు అందజేని రమేశ్, ప్రధాన కార్యదర్శి మటం రాజు, ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు బొనగిరి రాములు, డైరెక్టర్స్ బొల్లి కొమురయ్య, బీజేపీ నాయకులు బొల్లి శ్రీనివాస్, యూత్ నాయకులు పుచ్చకాయల అంజిరెడ్డి, పున్నం శేఖర్, నక్క మధు, హరి, సంతోష్, గౌరవెని అరుణ్, బొల్లి తరుణ్, పున్నం అజయ్, దామరపల్లి రంజిత్‌రెడ్డి, తదితరులున్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి నూతన ఓటు హక్కు కల్పించాలి

### ఓటర్ లిస్ట్‌లో తప్పులుంటే అభ్యంతరాలు తెలుపవచ్చు

### ఓటర్ నమోదు పై అవగాహన కల్పించాలి

### హుస్నాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి బెన్‌షాలెమ్

హుస్నాబాద్,సెప్టెంబర్ 6,(మనం న్యూస్)ః అర్హులైన ప్రతి ఒక్కరికి నూతన ఓటు హక్కు కల్పించాలని హుస్నాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి బెన్‌షాలెమ్ అన్నారు. హుస్నాబాద్ పట్టణ కేంద్రంలోని మున్సిపల్ మీటింగ్ హాల్‌లో బూత్ లెవల్ అధికారులకు, రాజకీయ పార్టీల నాయకులకు, కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి బెన్‌షాలెమ్ హాజరైనారు. ఈసందర్భంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో అర్హులైన వారందరిని ఓటర్లుగా గుర్తించబడేలా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకొని ఓటరుగా గుర్తించబడని వారందరిని ఓటర్లుగా గుర్తించేలా ఒక్కో కళాశాలకు తహసీల్దార్, బిఎల్‌ఓలను నియమించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఓటర్ లిస్టులో మార్పులు, చేర్పులు, తొలగింపుల పై ప్రతి ఒక్కరూ పరిశీలించి ఫామ్ 9, 10,11 ల ఓటర్లలో ఏమైనా తేడా ఉంటే అభ్యంతరాలు తెలపాలన్నారు. కొత్తగా ఓటర్ నమోదు చేసుకోవడానికి ప్రతి బూత్ లెవల్ అధికారులు మీ పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని ఆయన స్పష్టం చేసారు. 96 మంది విఆర్ఏలు బిఎల్‌వోలుగా ఉండేవారని వారి స్థానంలో కొత్త వారిని నియమించడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రతి రాజకీయ పార్టీ నాయకులకు ఏఎస్‌డి లిస్ట్ పై అవగాహన అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, బూత్ లెవల్ అధికారులు, ఆయా పార్టీల రాజకీయ నాయకులు, తదితరులున్నారు.



# చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ



నంగునూరు, సెప్టెంబర్ 06, మనం న్యూస్ః నంగునూరు మండల పరిధిలోని పాలమాకుల, రాజ్‌గోపాల్‌పేట, ముండ్రాయి, బద్దిపడగ గ్రామాలతోపాటు పలు గ్రామాల్లో బుధవారం మాజీ ఎంపిపి జాప శ్రీకాంత్‌రెడ్డి చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు సహకారంతో మండల పరిధిలోని వివిధ గ్రామాల్లోని చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. గత మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే ఉద్దేశంతో మంత్రి హరీశ్‌రావు సహకారంతో నేడు వారికి గొడుగులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి చైర్మన్ రాగుల సారయ్య, సీనియర్ నాయకులు వేముల వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఎల్లంకి రవిందర్‌రెడ్డి, నాయకులు ఏటి పరమేశ్వర్, ఐలయ్య, పంగ రవి, తెరాస గ్రామశాఖ అధ్యక్షులు వర్కోలు వెంకట్, శామంతుల కనకరాజు, శామంతుల మల్లయ్య , కనకయ్య, ప్రశాంత్, ఇమ్రాన్, సంపత్, రమేష్‌లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# గంగపుత్రులకు అవకాశం ఇవ్వండి

సిద్దిపేట, సెప్టెంబర్ 06, మనం న్యూస్ ప్రతినిధిః రాబోయే శాసనసభ ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో ఉన్న గంగపుత్రులకు శాసనసభ్యులుగా పోటీ చేసే అవకాశాన్ని ఆయా పార్టీలు ఇవ్వాలంటూ గంగపుత్రుల సంఘం జిల్లా అధ్యక్షులు బిజ్జ లక్ష్మణ్ అన్నారు. బుధవారంనాడు సిద్దిపేట జిల్లా గంగపుత్రుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గంగపుత్రుల సంఘం రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ అధ్యక్షులు కొత్తపల్లి వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి కటుకూరి నర్సయ్యలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజ్జ లక్ష్మణ్ మాట్లాడుతూ రాబోయే శాసనసభ ఎన్నికల్లో సిద్దిపేట నుండి గంగపుత్రులు పోటీ చేసేందుకు భారతీయ జనతా పార్టీ అవకాశం కల్పించాలన్నారు. పెద్ద






సంఖ్యలో ఉన్న గంగపుత్రులకు సముచిత స్థానం, అవకాశాలు కల్పిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గంగపుత్రులంతా ఆ పార్టీ గెలుపు కోసం పని చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా త్వరలో జరగబోయే జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్ష, డైరెక్టర్ల ఎంపికలోనూ గంగపుత్రులకు సముచిత స్థానం కల్పించడంతోపాటు గంగపుత్రుల ఐక్యతకు రాబోయే రోజుల్లో కార్యాచరణకు మరింత సమిష్టిగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపి నుండి గంగపుత్రులకు అవకాశం ఇవ్వాలంటూ త్వరలోనే 69 గ్రామాల కమిటీలతో తీర్మానాలను అందజేయనున్నట్లు తెలిపారు.

## నేటి నుండి సిటీ పోలీస్ యాక్ట్ అమలు

### పోలీస్ కమీషనర్ శ్వేత



సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 06, మనం న్యూస్ః సిద్దిపేట పోలీస్ కమీషనరేట్ పరిధిలో నేటి నుండి సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని సిద్దిపేట సిపి శ్వేత తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ నుండి 14వ తేదీ ఉదయం 6 గంటల వకు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. సిద్దిపేట పోలీస్ కమీషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు,ర్యాలీలు, రాస్తా రోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదనద్నారు. అవసరమైతే ముం దుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, శాంతిభద్రతలకు నిరంత రం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు.

## కూడవెల్లి వాగులో విరివిగా చేపలు



తొగుట, సెప్టెంబర్ 06, మనం న్యూస్ః తొగుట మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో కూడవెల్లి వాగు పొంగి ప్రవహిస్తుంది. భారీ వర్షాలకు వాగులు పొంగి ప్రవహిస్తుండంతో నీటి ప్రవాహంలో చేపలు భారీగా వస్తుండడంతో చందాపూర్ వద్ద మత్స్యకారులు బుధవారం చేపలు పట్టారు. ఒక్కో చేప 6 కిలోల వరకు ఉండడంతో మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడవెల్లి వాగు కరువుతో ఎండిపోవడంతో చేపలు దొరికేవి కాదని, మూడేళ్లుగా మల్లన్న సాగర్ నుండి నీటిని విడుదల చేయడంతో కూడవెల్లి జీవనదిగా మారిందని గ్రామ సర్పంచ్ బొడ్డు నర్సింలు తెలిపారు. దీంతో వాగులో చేపలు పెద్ద ఎత్తున వృద్ధిచెందుతున్నాయన్నారు.

## బైక్ కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు



కొండపాక, సెప్టెంబర్ 06, మనం న్యూస్ః కారు, బైక్ ఢీ కొనడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని రాజీవ్ రహదారిపై చోటు చేసుకుంది. బందారం గ్రామానికి చెందిన జాపా వరుణ్ (28) అతడి మిత్రుడు దండుగుల ప్రశాంత్‌తో కలిసి బైక్‌పై సిద్దిపేట వెళ్తుండగా కాఫీ డే సమీపంలో కొండపాక గ్రామానికి చెందిన ఎర్రబోయిన శ్రీశైలం కారులో వెళ్తుండగా సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుండి వచ్చిన బైక్ కారును బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో వరణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటన ప్రాంతానికి వెళ్లి వారిని సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వరుణ్‌కు తీవ్ర గాయాలు కాగా ప్రశాంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

## ముదిరాజ్‌లకు రాజకీయ వాటా దక్కాల్సిందే

### సిద్దిపేటలో త్వరలో భారీ నిరసన ర్యాలీ

### సన్నాహక సమావేశంలో ముదిరాజ్ సంఘాల నాయకులు



సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 06, మనం న్యూస్ః ముదిరాజ్‌లకు రాజకీయంగా దక్కాల్సిన వాటా అధికార పార్టీ నుండి దక్కలేదని, ముదిరాజ్‌ల రాజకీయ వాటా కోస హక్కుల కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తామని ముదిరాజ్ సంఘం నాయకులు అన్నారు. బుధవారం సిద్దిపేటలోని పెద్దమ్మ దేవాలయ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ అధికారంలో ఉన్న పార్టీ 115 నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థుల లిస్టును ప్రకటించినప్పటికీ ముదిరాజ్‌లకు అవకాశం ఇవ్వకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలోని ఆయా నియోజకవర్గాల్లో మెజార్టీ స్థాయిలో ఉన్న ముదిరాజ్‌ల ఓటు బ్యాంకును అధికారం కోసం వాడుకొని ఇప్పుడు కులాన్ని అణిచివేయాలని చూస్తున్నారని విమర్శించారు. ముదిరాజ్‌లంతా ఏకమై హక్కుల కోసం, రాజకీయ సాధికారత కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ జంగిటి కనకరాజు, కౌన్సిలర్లు బర్ల మల్లికార్జున్, రాజు, ముదిరాజ్ పట్టణ అధ్యక్షులు మిద్దె రవి, సీనియర్ నాయకులు జంగిటి శ్రీనివాస్, బైరి శంకర్, ధ్మ ముదిరాజ్, గట్టు నర్సింలు, పడిగె ప్రశాంత్, బాలకృష్ణ, ముదిరాజ్ జర్నలిస్టు సంఘం నాయకులు రామకృష్ణ, పరమేశ్వర్, సతీష్, శ్రీనివాస్, అంకుష్, రవి, బాలేష్, తిరుపతితోపాటు సుమారు 300 మంది ముదిరాజ్‌లు పాల్గొన్నారు.



## జర్నలిస్టులకు సముచిత గౌరవం

### టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం

సిద్దిపేట, సెప్టెంబర్ 06, మనం న్యూస్ ప్రతినిధిః రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టగానే జర్నలిస్టులకు సముచిత స్థానాన్ని, గౌరవా న్ని కల్పిస్తామని టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం, కాంగ్రెస్ పార్టీ ప ట్టణ అధ్యక్షులు ఇమామొద్దీన్‌లు అన్నారు. బుధవారంనాడు జర్నలిస్టు డేను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఆయా పత్రికల్లో పని చేస్తున్న జర్నలిస్టులకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమా న్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర ఎనలేనిదని, ప్రజల ఆకాంక్షలను జాతీయ స్థాయిలో వినిపించడంలో జర్నలిస్టులు క్రియాశీల పాత్రను పోషించారన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నిర్ధాక్షిణ్యంగా వ్యవహరిస్తుందని, అనుకూలంగా వార్త లు రాసే విలేకర్లకు, పత్రికలకు మాత్రమే గౌరవాన్నిస్తూ ప్రశ్నించే వారి పట్ల నియంతృత్వంగా వ్యవహరిస్తుందన్నారు. తెలంగాణ ఏర్పా టులో జర్నలిస్టుల పాత్ర ఎనలేనిదని పొగిడిన కేసీఆర్ అధికారం చేపట్టగానే మాట మార్చారన్నారు. సొంత రాష్ట్రం సాధించుకోవంలో క్రియాశీల పాత్ర వహించిన జర్నలిస్టులకు కనీసం ఇంటి స్థలాలు కూడా ఇవ్వడంలో బిఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తప్పెట శంకర్, గణేష్, గ్యాదరి మధు, గయజుద్దీన్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు

## వాటర్ బాటిళ్లు, బ్యాగ్‌ల పంపిణీ

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 06, మనం న్యూస్ః ఉపాధిహామీ కూలీలకు మంత్రి హరీష్‌రావు చొరవతో అందిన స్టీల్ వాటర్ బాటిల్, టిఫిన్ బాక్సులు, బ్యాగ్‌లను సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలో బుధవారం గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు కూలీలకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తన్నీరు రేణుక శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధి కూలీలను మరింత ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్లాస్టిక్ వస్తువులు వాడకూడదన్న ఉద్దేశ్యంతో కూలీలకు స్టీల్ టిఫిన్ బాక్సులు, స్టీల్ వాటర్ బాటిళ్లు అందజేసినట్లు తెలిపారు. త్వరలో గ్రామంలో పూర్తి ప్లాస్టిక్ రహితంగా చేసి ప్లాస్టిక్ రహిత గ్రా




మంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మమత యాదగిరి, పంచాయతీ కార్యదర్శి శ్రీలత, ఉపాధిహామీ కూలీ వెంకటేశం, బిఆర్ఎష్ నాయకులు సంపత్ యాదవ్, కారోబార్‌లు మహిపాల్, యాదగిరి, ఉపాధిహామీ సిబ్బంది రాము తదితరులు పాల్గొన్నారు.




### ఉత్తమ పోలీస్ స్టేషన్‌లకై

# పోటీ పడాలి

**ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలి**

**వీడియో కాన్ఫరెన్స్‌లో డిజిపి అంజన్‌కుమార్**




సిద్ధిపేట, సెప్టెంబర్ 06, మనం న్యూస్ ప్రతినిధిః జాతీయ స్థాయిలో బెస్ట్ పోలీస్ స్టేషన్‌గా పోటీ పడాలని డిజిపి అంజన్‌కుమార్ అధికారులకు సూచించారు. బుధవారం పోలీస్ స్టేషన్‌ల పనితీరు, సంబంధిత అంశాలపై పోలీస్ కమీషనర్‌లతో, ఎస్పీలతో, ఏసిపిలతో హైదరాబాద్ నుండి డిజిపి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేసులను సత్వరమే పరిష్కరించాలని, ప్రతి కేసు క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులను 60 రోజులలో విచారణ పూర్తి చేసి చార్జిషీటు వేయాలని సూచించారు. విశేష ప్రతిభ కనబరిచిన పోలీస్ స్టేషన్‌లను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం జాతీయ స్థాయిలో పోటీ పడేందుకు 30 ఉత్తమ పోలీస్ స్టేషన్‌లను రాష్ట్రం నుండి ఎంపిక చేయడం జరిగిందన్నారు. సిద్దిపేట పోలీస్ కమీషనరేట్ పరిధిలో రాష్ట్ర స్థాయిలో ఆగస్టు నెల వరకు 2వ స్థానంలో ఉన్న గజ్వేల్ పోలీస్ స్టేషన్, 3వ స్థానంలో ఉన్న ములుగు పోలీస్ స్టేషన్, 5వ స్థానంలో ఉన్న బెజ్జంకి పోలీస్ స్టేషన్‌లు ఉన్నందుకు డిజిపి సంబంధిత ఏసిపి, ఎస్‌హెచ్ఓలను అభినందించారు. ఈ ర్యాంకింగ్ డిసెంబర్ వరకు ఇలాగే కొనసాగాలని సూచించారు. సిపి శ్వేత మాట్లాడుతూ బెస్ట్ ర్యాంకింగ్‌లో మరికొన్ని పోలీస్ స్టేషన్‌లు కూడా తయారు చేస్తామని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో అడిషనల్ డిసిపి అడ్మిన్ శ్రీనివాస్‌రావు, మల్లారెడ్డి, ఏసిపిలు రమేష్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# షెడ్యూల్ ప్రకారం రుణాలు మంజూరు చేయాలి

**జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్**

సిద్ధిపేట రూరల్, సెప్టెంబర్ 06, మనం న్యూస్ః ప్రభుత్వ ఆదేశాల మేరకు షెడ్యూల్ ప్రకారం రైతు రుణాలు వేగంగా మంజూరు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 83, 116 మంది రైతుల ఖాతాలకు రూ. 447.23 కోట్ల రూపాయలను విడుదల చేయడం జరిగిందన్నారు. వాటిలో రూ. 401.86 కోట్లు రైతుల ఖాతాలోకి జమ చేయడం జరిగిందని, మిగితావి అకౌంట్ నెంబర్‌లో తేడా వల్ల ఫెయిల్యూర్ అయ్యాయని, వాటిని త్వరగా పూర్తి చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులు సమన్వయంతో రైతులకు కేటాయించిన తేదీలలో గ్రామాల వారీగా బ్యాంక్‌లకు రుణాల కోసం రైతులు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శుల ద్వారా రైతులకు తెలియజేయాలన్నారు. పిఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా సూక్ష్మ తరహా ఆహార ఉత్పత్తి పరిశోధన స్థాపన కొరకు జిల్లాలో 160 అప్లికేషన్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వారం రోజుల్లోగా మంజూరు చేయాలని బ్యాంకు మేనేజర్లను ఆదేశించారు. నిరుపేద గిరిజనుల అభివృద్ధి కోసం ట్రైకార్ రుణాలు జిల్లాలో 20 అప్లికేషన్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరగా మంజూరు చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎల్‌డియం సత్యజిత్, ఏఓ శివప్రసాద్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఫిరంగి, మెప్మా పిడి హనుమంతరెడ్డి, యుబిఐఆర్ఎం వికాస్ తదితరులు పాల్గొన్నారు.






# మంత్రి హరీష్‌రావును కలిసి గౌడ సంఘం నాయకులు

కొమురవెల్లి, సెప్టెంబర్ 06, మనం న్యూస్ః కొమురవెల్లి మండల కేంద్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం వద్ద సర్వే నెంబర్ 223/11లో గల 10 గుంటల భూమి నిత్యాన్నదాన సత్రం నిర్మించడానికి మంత్రి హరీష్‌రావును కొమురవెల్లి మండల గౌడ సంఘం నాయకులు హైదరాబాద్‌లో బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు తమకు కేటాయంచిన స్థలాన్ని తమకే కేటాయించాలని, స్థలంపై జరుగుతున్న కుట్రలను మంత్రికి వివరించారు. ఈమేరకు మంత్రి స్పందించి కొమురవెల్లి దేవాలయం వద్ద ఉన్న 10 గుంటల భూమిని గౌడ సంఘానికి ఇప్పించే విధంగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. కొమురవెల్లి మల్లన్న దేవాలయం వద్దకు ఎంతో మంది భక్తులు భారీగా వస్తుంటారని, ఇక్కడ ఉన్న గదులు డోనర్స్ నిర్మించినవే కావడంతో గదులు దొరకాలంటే భక్తులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటివారికి గౌడ సోదర సోదరీమణులకు సేవ చేసినట్టుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి మండల గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.





# సిద్దిపేట విద్యార్థులకు సువర్ణావకాశం

**-ఈ విద్యా సంవత్సరం నుండి ఫార్మసీ కళాశాలకు అనుమతి**

**-కౌన్సిలింగ్‌లో సిద్దిపేట ఫార్మసీ కళాశాల ఎంచుకునే అవకాశం**

**-60 సీట్లతో ప్రారంభం కానున్న కళాశాల**

సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 06, మనం న్యూస్ః సిద్దిపేట విద్యాక్షేత్రంగా విరాజిల్లుతున్న నేపథ్యంలో మరో మణిహారంగా శ్రీ రంగనాయక సాగర్ ఫార్మసీ కళాశాల రావడంతో ఫార్మసీ చేసే సిద్దిపేట ప్రాంత విద్యార్థులకు సువర్ణావకాశంగా మారనుంది. ఫార్మసీ చదవాలంటే సుదూర ప్రాంతాలకు వెళ్లి చదవాల్సి వచ్చేది, కానీ రంగనాయక సాగర్ ఫార్మసీ కళాశాల ఏర్పాటుతో విద్యార్థులకు కష్టాలు తప్పనున్నాయి. సిద్దిపేట నలువైపులా పాలిటెక్నిక్ కళాశాలలు, ఐటిఐ, మెడికల్, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటై విద్యార్థులకు విద్యను అందిస్తూ విద్యాక్షేత్రంగా విరాజిల్లిన సిద్దిపేటలో మంత్రి హరీష్‌రావు ప్రత్యేక చొరవతో ఫార్మసీ కళాశాల ఏర్పడడంతో ఇక్కడి ప్రాంత విద్యార్థులకు సద్వినియోగం చేసుకునే అవకాశం లభించింది. ఫార్మసీ కౌన్సిలింగ్‌లో సిద్దిపేట కళాశాల కోడ్ ఎస్ఆర్ఎస్‌పిగా అందుబాటులోకి వచ్చింది, దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.



# సీఎం కేసీఆర్ నేతృత్వంలో విద్యకు పెద్దపీట

## దేశానికే ఆదర్శంగా రాష్ట్ర విద్యా వ్యవస్థ

## టిఎస్‌హెచ్‌డిసి ఛైర్మన్ చింతా ప్రభాకర్

సంగారెడ్డి, సెప్టెంబర్ 06, మనం న్యూస్ః సీఎం కేసీఆర్ పాలనలో విద్యకు పెద్దపీటేస్తూ దేశానికే ఆదర్శంగా తెలంగాణ నిలుస్తుందని టిఎస్‌హెచ్‌డిసి ఛైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని పిఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో గురుపూజోత్సవం సందర్భంగా బుధవారం చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 130 మంది ఉత్తమ ఉపాధ్యా యులకు టిఎస్‌హెచ్‌డిసి ఛైర్మన్ చింతా ప్రభాకర్, జెడ్పి ఛైర్మన్ మంజుశ్రీ జయపాల్‌రెడ్డిలతో కలిసి సన్మానించి పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా





వారు మాట్లాడుతూ సమాజంలో పెద్ద కుటుంబం అంటే అది ఉపాధ్యాయులది, విద్యార్థులది అని, సీఎం కేసీఆర్ విద్యకు ప్రాధాన్యతనిస్తూ గురువులను నిలువెత్తు గౌరవం అందాలని కోరిన వ్యక్తి సీఎం కేసీఆర్ అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావు దృష్టికి తీసుకువెళ్లడానికి కృషి చేస్తానని, ఉపాధ్యాయుల ఆశీస్సులు ఎల్లవేళలా తమపై ఉండాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయ సంఘం నాయకులు మాట్లాడుతూ చింతా ప్రభాకర్ వంటి నాయకులు విద్యాశాఖ మంత్రి కావాలని, భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా విజయం సాధించి విద్యాశాఖ మత్రి కావాలని ఉపాధ్యాయ సంఘాల తరుపున కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిఈఓ వెంకటేశ్వర్లు, సిడిసి ఛైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, ఏఎంసి ఛైర్మన్ ప్రభు గౌడ్, మాజీ సిడిసి ఛైర్మన్ విజేందర్‌రెడ్డి, జెడ్పిటిసిలు, ఎంపిటిసిలు, డా. శ్రీహరి, మండల ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# బాహర్ ఫేంకో మత్

## -ఆరుబయట చెత్త పడేయకుండా అవగాహన కల్పించాలి

## -సిద్దిపేట మున్సిపల్ కమీషనర్ సంపత్‌కుమార్



సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 06, మనం న్యూస్ః ప్రజలు తమ ఇళ్లలో నుండి వెలువడే చెత్తతోపాటు చిన్న పిల్లలు వినియోగించే చాక్లెట్ కవర్లు, చిన్న చిన్న ప్లాస్టిక్ వస్తువులను బయట పడేయకుండా (బాహర్ ఫేంకో మత్) చూడాలని మున్సిపల్ కమీషనర్ సంపత్ సూచించారు. బుధవారం ఆరు బయట చెత్త పడేయకు, పడేయనివ్వకు అనే కార్యక్రమంపై మున్సిపల్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయట తిరుగుతున్న సమయంలో ప్రజలు, చిన్నపిల్లలు పలుమార్లు కుర్‌కురే, చాక్లెట్ కవర్లు, బిస్కెట్ ప్యాకెట్‌లు, పలువురు చెత్త బయట వేస్తున్నారని, అలా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసేవారిని నివారించి చెత్త బయట వేయరాదని వారికి సూచించాలన్నారు. స్వచ్ఛ సిద్దిపేటకై మంత్రి హరీష్‌రావుపడుతున్న తాపత్రయం, ఇందుకు ఆయన చేస్తున్న కృషిని ప్రజలకు వివరించాలని, తద్వారా ప్రజల్లో సంపూర్ణ మార్పు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. వారే కాకుండా వారు ఇతరులను చెత్త బయటవేయకుండా చూడాల్సిన అందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరు ఇంట్లో వెలువడే చెత్తను తడి, పొడి, హానికర చెత్తగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

## స్టార్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవం

## టిఎస్‌హెచ్‌డిసి ఛైర్మన్ చింతా ప్రభాకర్




సంగారెడ్డి, సెప్టెంబర్ 06, మనం న్యూస్ః అనారోగ్యం బారిన పడి ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని టిఎస్‌హెచ్‌డిసి ఛైర్మన్ చింతా ప్రభాకర్, జెడ్పి ఛైర్మన మంజుశ్రీ జయపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ సత్యనారాయణ, డిసిసిబి వైస్ ఛైర్మన్ పట్నం మాణిక్యం, పిఎన్ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ పులిమామిడి రాజు, జిల్లా కలెక్టర్ శరత్‌కుమార్‌లు అన్నారు. బుధవారం రోజున సంగారెడ్డి పట్టణంలో నూతనంగా నిర్మించిన స్టార్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులు ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. అనంతరం మేనేజింగ్ డైరెక్టర్ హరి రాథోడ్ మాట్లాడుతూ సంగారెడ్డి పట్టణ కేంద్రంలోని స్టార్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి 24/7 ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ రోజుల్లో పేద ప్రజలు నమ్మకంగా కొలిచేది భగవంతుడిని, తర్వాత వైద్యుడిని మాత్రమే అన్నారు. కావున ప్రజలకు మంచి నాణ్యమైన ఆరోగ్య సేవలు తమ ఆసుపత్రిలో అందిస్తామన్నారు. తాను కూడా పేదరికంలో పుట్టి పెరిగానని, కావున పేద ప్రజలకు స్టార్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సేవ చేసేందుకు ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ సతీష్ పాటిల్, మున్సిపల్ ఛైర్మన్, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ గోవర్ధన్ నాయక్, మున్సిపల్ ఛైర్మన్ విజయలక్ష్మి రవి, సిడిసి ఛైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ సిడిసి ఛైర్మన్ విజేందర్‌రెడ్డి, నాయకులు పవన్ జైపాల్ నాయక్, మోహన్ సింగ్ నాయక్, ఫూల్ సింగ్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.





# రాష్ట్ర ఉత్తమ ప్రిన్సిపల్‌గా ఎంపికైన కె. శ్రీనివాస్

## రాష్ట్ర విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డు స్వీకరణ

## అభినందించిన కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు

మిరుదొడ్డి, సెప్టెంబర్ 06, మనం న్యూస్ః సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాలో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని మిరుదొడ్డి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె. శ్రీనివాస్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఉపాధ్యాయ దినోత్సవం రోజున హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, హోం మంత్రి మహమూద్ అలీ, ఇంటర్ విద్యా కమీషనర్ నవీన్ మిట్టల్ చేతుల మీదుగా ప్రిన్సిపల్ కె. శ్రీనివాస్ రాష్ట్ర ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు, ప్రశంసా పత్రంతోపాటు రూ. 10 వేల చెక్కును అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాస్‌కు అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ తన బాధ్యత మరింత పెరిగిందని, సర్వీస్‌లో ఉన్నంత కాలం విద్యార్థుల అభివృద్ధి కోసం వారి సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతానని, ప్రభుత్వం రూ. 10 వేల పారితోషికాన్ని కళాశాల అభివృద్ధికై అధ్యాపక బృందానికి అందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు , విద్యార్థులు పాల్గొన్నారు.

# నేటి నుండి మల్లన్న సాగర్‌లోకి నీటి విడుదల

తొగుట, సెప్టెంబర్ 06, మనం న్యూస్ః తొగుట మండలం తుక్కాపూర్ గ్రామంలో గల మల్లన్న సాగర్ ప్రాజెక్టులోకి నేటి నుండి నీటిని విడు దల చేయడానికి ఏర్పాట్లు చేసినటుల ప్రాజెక్టు డిఈఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లో ప్రసుతతం 10.85 టిఎంసీల నీరు ఉందని, గురువారం ఉదయం నుండి ప్రాజెక్టులోకి నీటి పంపింగ్ ప్రారంభించబడుతుందన్నారు. నేటి పంపింగ్ 10 రోజుల పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామని, మొత్తం 5200 క్యూసెక్కుల నీటి విడుదలకు 4 పంపుల ద్వారా ఒక్కో పంపు నుండి 1300 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. రోజుకు 0.45 టిఎంసీల నీటిని ఎత్తిపోయాల్సి ఉంటుందన్నారు.

# విద్యార్థుల భవిష్యత్ నిర్ధేశకులు ఉపాధ్యాయులు

## బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి



రామచంద్రాపురం, సెప్టెంబర్ 06, మనం న్యూస్ ప్రతినిధిః రామచంద్రాపురం పట్టణంలో ఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో, ఎస్ఆర్ ట్రస్టు ఛైర్మన్ డా. సి. అంజిరెడ్డి, ఎస్.ఆర్. ట్రస్టు అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున అశోక్‌నగర్‌లోని గ్రాండ్ సితార హోటల్‌లో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఉపాధ్యాయులు భారీ ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్మన్ అంజిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుడి వృత్తి ఎంతో ఉన్నతమైందని, సమాజాన్ని సక్రమమైన మార్గంలో మార్చడానికి ఉపాధ్యాయులే ముఖ్య కారణమని, వారి సేవలను గుర్తించి సన్మానించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అదేవిధంగా ఎస్ఆర్ ట్రస్టు అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనది అని, విద్యార్థులను మంచి దేశ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత టీచర్లపైనే ఉంటుందని ఉపాధ్యాయునిగా ఉండి భారత రాష్ట్రపతిగా ఎదిగిన డా. సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినం పురస్కరించుకొని గురుపూజోత్సవం జరుపుకోవడం చాలా సంతోషించదగ్గ విషయమన్నారు. అదేవిధంగా తలరాతలు మార్చేది ఆ బ్రహ్మ దేవుడైతే మన తలరాతలు మార్చి భవిష్యత్తుకు పునాది వేసేది ఉపాధ్యాయుడన్నారు. ఇలాంఇ ఉపాధ్యాయులను గౌరవించుకోవడం మన సాంప్రదాయమన్నారు. ఈకార్యక్రమంలో జిల్లాలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# మల్లన్న ఆలయంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు

కొమురవెల్లి, సెప్టెంబర్ 06, మనం న్యూస్ః మండల కేంద్రంలోని గురువారం రోజున శ్రీ మల్లికార్జున స్వామి వారి ఆలయంలో శ్రీకృష్ణ అష్టమి పురస్కరించుకొని శ్రీ మల్లికార్జున స్వామి వారి ఉత్సవ మూర్తుల ఊరేగింపు దేవాలయం నుండి పురవీధుల గుండా సేవా ఊరేగింపు చేశారు. శ్రీకృష్ణుడు, గొల్లభామ వేషధారణతో ఉట్టి కొట్టడం కార్యక్రమం నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు స్వామి వారి దేవాలయం వద్ద పంచ రంగులతో పెద్దపట్నం ఒగ్గు పూజారులచే వేసి ఒగ్గు జానపదులతో డోలు చప్పుళ్లతో ఒగ్గు పూజారులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ గీస బిక్షపతి, ఏఈఓ వైరాగ్యం అంజయ్య, పాలకమండలి సభ్యులు, దేవాలయ అర్చకులు,



ఒగ్గు పూజారులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# ప్రజలు జాగ్రత్తగా ఉండాలి



నంగునూరు, సెప్టెంబర్ 06, మనం న్యూస్ః నంగునూరు మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండల పరిధిలోని వాగులు వంకలు ఉధృతంగా ప్రవహించడంతో ప్రజలు పోలీసులకు సహకరిస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజ్‌గోపాల్‌పేట ఎస్ఐ మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అక్కెనపల్లి, బుస్సాపూర్ వాగుతోపాటు దర్గాపల్లి, సికింద్లాపూర్ మధ్య వాగులు ఉధృతంగా ప్రవహించడం జరుగుతుందని, కావున రెండు దారులను మూసి వేయడం జరిగిందన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సహకరించి తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, లేదా వేరే మార్గాల నుండి వెళ్లాలన్నారు.

## బాధిత కుటుంబానికి బీజేపి నాయకుల చేయూత



దుబ్బాక, సెప్టెంబర్ 06, మనం న్యూస్ః దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ 2వ వార్డుకు చెందిన కంతిపెద్ద గంగయ్య మరణించిన విషయం తెలుసుకున్న బీజేపి నాయకులు ఆకుల నరేష్ దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు సహకారంతో వారి కుటుంబానికి బుధవారం 50 కిలోల బియ్యం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి కుటుంబానికి బీజేపి పార్టీ తరుపున ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. ఎమ్మెల్యే రఘునందన్‌రావు పేద ప్రజల పక్షపాతిగా వారికి ఏ కష్టం వచ్చినా ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు దుబ్బాక బుగ్గరాజు, సీనియర్ నాయకులు కనకరాజు, భాస్కర్, తుడుం ఎల్లయ్య, మహేష్, గుండెల్లి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బాక రెవెన్యూ డివిజన్ ఆవశ్యకతపై కరపత్రం ఆవిష్కరణ



దుబ్బాక టౌన్, సెప్టెంబర్ 06, మనం న్యూస్ః నియోజకవర్గ కేంద్రమైన దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ సీఎం కేసీఆర్ గురువైన బాల్‌రెడ్డి బుధవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలోని అన్ని కార్యాలయాలు ఉన్న దుబ్బాకను ప్రభుత్వం రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరారు. దుబ్బాక రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం అన్ని అర్హతలు, డివిజన్ ఏర్పాటు వలన ఏర్పాటు కాబోయే కార్యాలయాలు వంటి అన్ని వివరాలతో కూడిన కరపత్రాన్ని దుబ్బాక రెవెన్యూ డివిజన్ జేఏసి ఆధ్వర్యంలో ఇంటింటికి, షాపులకు పంపిణీ చేస్తారన్నారు. రెవన్యూ డివిజన్ ఏర్పాటు వలన అన్ని రకాల డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు అయి దుబ్బాక నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షులు మాడబోయిన శ్రీకాంత్, దుబ్బాక రెవెన్యూ డివిజన్ జేఏసి ప్రతినిధులు రేపాక భాను, చింత సంతోష్, రాజేష్, కడవేర్గు రాజేందర్, నాగరాజు, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

### గోపికల వేషధారణలో అలరించిన చిన్నారులు



దౌల్తాబాద్, సెప్టెంబర్ 06, మనం న్యూస్ః శ్రీ కృష్ణాష్టమి జన్మదిన వేడుకలు పురస్కరించుకొని మండల పరిధిలోని సూరంపల్లిలో చతుర్విద టాలెంట్ స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు చిన్నికృష్ణయ్య, గోపికల వేషధారణలతో సాంస్కృతిక కార్యక్రమాలు చేసి ప్రజలను ఆకట్టుకున్నారు. నేటి సమాజం పూర్తిగా ఫోన్‌ల వైపు మొగ్గు చూపుతుంటే ఇలాంటి మారుమూల గ్రామంలో సాంస్కృతిక కార్యక్ర మాలు చేయడంలో వారికి వారే ధిట్ట అని స్థానిక ప్రజలు అభినం దించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన పాఠశాల బృందానికి స్థానికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా మండల వ్యాప్తంగా చాలా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు

**-జలకళను సంతరించుకున్న చెరువులు, కుంటలు**

**-రాందాస్ చెరువు అలుగు పారడంతో రోడ్డుపై నుండి వెళ్తున్న నీరు**



దౌల్తాబాద్, సెప్టెంబర్ 06, మనం న్యూస్ః గత మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు అలుగులు పొంగి పొర్లడంతో దౌల్తాబాద్ రాందాస్ చెరువు అలుగు పారడంతో దొమ్మాట వాసులు పై నుండి నీరు పారడంతో వచ్చి పోయే ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. వర్షాకాలం వస్తుందంటేనే చాలు సిద్దిపేట వెళ్లే ప్రయాణికుల గుండెల్లో గుబులు పుట్టాల్సిందే, గత మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షానికి మండల పరిధిలోని లింగరాజుపల్లి, సూరంపల్లి, ముత్యంపేట, దొమ్మాట, గాజులపల్లి, మిరుదొడ్డి, తొగుట మండలాల ప్రజలు ప్రతి రోజు దౌల్తాబాద్ పట్టణానికి వచ్చిపోయే రైతులకు, ఉద్యోగులకు ఇబ్బందికరంగా మారింది. రోడ్డుపై నుండి నీరు ప్రవహిస్తున్న విషయమై గతంలో ఎన్నోమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవని, ఈ సంవత్సరమైన వంతెన ఏర్పాటు చేసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

# అనుమానస్పద స్థితిలో విద్యార్థి ఆత్మహత్య



దౌల్తాబాద్, సెప్టెంబర్ 06, మనం న్యూస్ః అనుమానస్పద స్థితిలో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన దౌల్తాబాద్ మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన చిదుగు సతీష్ గౌడ్ (20) బుధవారం తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా మరణానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.